క్లుప్తంగా

గ్రామాలలో పోలీసుల కవాతు



సి.బెళగల్ కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

సి.బెళగల్: మండల పరిధిలోని మూడు గ్రామాలలో ఆదివారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల ప్రకటన వెలువడటంతో గ్రామాలలో ప్రజలకు రక్షణ, ఎన్నికలలో ఎవ్వరూ అలజడులకు పాల్పడకుండా ఉండేందుకు పోలీస్ సిబ్బందితో మండలంలోని సి.బెళగల్, కంబదహాల్, పోలకల్ గ్రామాల్లో కవాతు నిర్వహించినట్లు కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. కవాతులో పారామిలటరీ, ఏఆర్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలో కుళాయిల ధ్వంసం



బాలికల హైస్కూల్లో ఆకతాయిలు ధ్వంసం చేసిన కుళాయిలు

కోడుమూరు రూరల్: పట్టణంలోని బాలికల హైస్కూల్లో కొందరు ఆకతాయిలు చొరబడి వాష్‌బేసిన్‌కు సంబంధించిన కుళాయిలతో పాటు తాగునీటి కుళాయిలను ధ్వంసం చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కుళాయిలను కర్రలతో కొట్టి పూర్తిగా ధ్వంసం చేయడంతో బాలికలు ఉపయోగించేందుకునేందుకు కుళాయిలు లేని పరిస్థితి నెలకొంది. గతంలోనూ కొందరు ఆకతాయిలు ఇలాంటి ఘటనలకు పాల్పడ్డారని, ప్రస్తుతం 32 కుళాయిలను ధ్వంసం చేశారని హెచ్‌ఎం నాగరాజకుమారి తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షలు

పాణ్యం: గ్రూప్-1పరీక్షలను అధికారులు ఆదివారం పకడ్బందీగా నిర్వహించారు. ఆర్జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆర్జీఎంలో 696 మందికి గాను 421, శాంతిరాం కళాశాలలో 600 గాను 274 మంది పరీక్షలకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు జరిగాయని చెప్పారు.

ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర దేవతా మూర్తులు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగరీథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత తరగతులు నిర్వహించారు. శీల ప్రభుపాదుల ప్రేమ విందు నిర్వహించారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన్ సేవక్ ప్రభు భగవద్గీతపై ప్రవచనం చెప్పారు. మానవ సంబంధాలు, ఉన్నత జీవనం సాగించేందుకు ఉపయోగ పడే అన్ని అంశాలు భగవద్గీతలో ఉన్నాయన్నారు. గీత పఠనం, శ్రవణంతో జీవన యానంలో మార్పు వస్తుందన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం



విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్‌లు అందజేస్తున్న డి.గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): ఆత్మరక్షణకు కరాటే అవసరమని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. ఆదివారం జొహరాపురంలోని షరీక్ నగర్‌లో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, యూనివర్సల్ బూడోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు బెల్ట్‌గ్రేడింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శిక్షకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనలను ఓడించండి

కర్నూలు(సెంట్రల్): మతోన్మాద బీజేపీతో అంటకాగుతున్న టీడీపీ, జనసేన అభ్యర్థులను ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. ఆదివారం 48వ వార్డు పరిధిలోని అమీర్ హైదర్ ఖాన్ నగర్ శాఖ జనరల్‌బాడీ సమావేశం ఓల్డ్‌సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ బీజేపీకి అండగా ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఉండే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. సీఏఏ చట్టం అమలుపై చంద్రబాబునాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ కూటమికి దారుణమైన ఓటమి తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.నిర్మల పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి పదోతరగతి పబ్లిక్ పరీక్షలు
- మండలంలో ఐదు కేంద్రాల కేటాయింపు
- పరీక్షలు రాయనున్న 1,307 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు





సి.బెళగల్ మోడల్ స్కూల్లో ఇన్విజిలేటర్లకు సూచనలు చేస్తున్న ప్రిన్సిపాల్ వంశీమోహన్, కొత్తకోట పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు రాస్తున్న అధికారులు

సి.బెళగల్: సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని జెడ్పీ హైస్కూల్, మోడల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాలతో పాటు కొత్తకోట జెడ్పీ హైస్కూల్‌లో రెండు (కొత్తకోట - ఏ, కొత్తకోట - బీ) పరీక్ష కేంద్రాలలో పబ్లిక్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహణ అధికారి (కస్టోడియన్) కేశవనాథ్, జాయింట్ కస్టోడియన్ నాగ మణికుమార్ తెలిపారు. ఐదు పరీక్ష కేంద్రాలలో 1,024 మంది రెగ్యులర్ విద్యార్థులు, 283 మంది ప్రైవేట్, కంపార్ట్‌మెంటల్ విద్యార్థులు మొత్తం 1.307 మంది పరీక్షలు రాయనున్నారు.

పరీక్ష కేంద్రాల వారీగా విద్యార్థుల వివరాలు

సి.బెళగల్ జెడ్పీహైస్కూల్ పరీక్ష కేంద్రంలో 260 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. అదేవిధంగా కొత్తకోట జెడ్పీ హైస్కూల్ ఏ- పరీక్ష కేంద్రంలో 176, బీ - కేంద్రంలో 88 మంది, ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 240 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పరీక్ష కేంద్రంలో 260 మంది రెగ్యులర్ విద్యార్థులు వారి భవితవ్యాన్ని తేల్చుకోనున్నారు. మండల విద్యార్థులతోపాటు నాలుగు పరీక్షల కేంద్రాలకు దగ్గరలోని గూడూరు, ఎమ్మిగనూరు, కర్నూలు మండలాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు కూడా పరీక్షలకు హాజరవుతారని చెప్పారు.

ప్రైవేట్ విద్యార్థులకు మండలంలోనే..

ప్రైవేట్‌గా పదో తరగతి రాసే వారితో పాటు గతంలో ఫెయిలై సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు మండలంలోనే పరీక్ష కేంద్రాలను కేటాయించారు. మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో.. సి.బెళగల్ జెడ్పీహైస్కూల్ పరీక్ష కేంద్రంలో 61 మంది ప్రైవేట్ విద్యార్థులు, ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 70 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పరీక్ష కేంద్రంలో 48 మంది, కొత్తకోట ఏ కేంద్రంలో 70, బీ కేంద్రంలో 34 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

మండలంలోని పాఠశాలల విద్యార్థుల వివరాలు

మండలంలో తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు కస్తూరిబా బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మొత్తం 12 పాఠశాలలకు చెందిన 810 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో 391 మంది తెలుగు, 419 మంది ఇంగ్లిష్ మీడియాలలో పరీక్షలకు హాజరు అవుతారని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉటుందని పరీక్షల నిర్వహణ అధికారులు తెలిపారు. పరీక్షల కేంద్రాల నుంచి 100 మీటర్ల వరకు 144 సెక్షన్ ఉంటుందని, కేంద్రాల దగ్గరకు ఎవరూ రాకూడదని, అదేవిధంగా పరీక్షలు జరిగే గ్రామాలలో జిరాక్స్ సెంటర్లును సైతం పరీక్షల వేళల్లో మూసివేసేలా ఉన్నతాధికారులు ఆదేశాలు ఉన్నాయన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని హెచ్చరిస్తున్నారు.

పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నాం



పదో తరగతిలో ఈ సంవత్సరం మాకు అన్ని క్లాస్‌లు బాగా జరిగాయి. సార్ వాళ్లు మొత్తం సిలబస్‌ను చెప్పి, ఎప్పటికప్పుడు పరీక్షలు పెట్టారు. మేము ఇప్పటికే నాలుగు రివిజన్ టెస్టులు, ప్రీఫైనల్ పరీక్షలు రాసి మార్కులు పొందాం. పబ్లిక్ పరీక్షలను రాసేందుకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాం.
– బెస్త జగన్, 10వ తరగతి విద్యార్థి, మోడల్ స్కూల్, సి.బెళగల్

ప్రశాంత వాతావరణం కల్పిస్తాం



పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశాం. అదేవిధంగా స్థానిక వైద్యులతో మాట్లాడి అత్యవసర వైద్య సేవలను కల్పించేందుకు చర్యలను తీసుకున్నాం. పరీక్ష కేంద్రాలలో అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్షలను రాసేలా చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వం సైతం పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచడంతో ఏర్పాట్లను పూర్తి స్థాయిలో చేశాం. – జ్యోతి, సి.బెళగల్ ఎంఈఓ

పరీక్ష కేంద్రాల దగ్గరకు వస్తే క్రిమినల్ కేసులు



పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు నిర్వాహకులకు, పోలీసులకు సహకరించాలి. మండలంలోని ఐదు పరీక్షల కేంద్రాల వద్ద పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఎవరైనా అలజడులు సృష్టించాలని చూసినా, నిబంధనలకు విరుద్ధంగా పరీక్ష కేంద్రాల వద్దకు వస్తే చట్ట పరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.
– తిమ్మారెడ్డి, ఎస్ఐ, సి.బెళగల్

నేటి నుంచి స్పందన రద్దు

సి.బెళగల్: ప్రతి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందువల్ల జిల్లా ఉన్నతాధికారులు రద్దు చేసినట్లు తహసీల్దార్ అనుపమ ఆదివారం తెలిపారు. ఇకపై గ్రామ సచివాలయాల్లో, మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందన ఉండదన్నారు. మండల ప్రజలకు ఎవైనా సమస్యలుంటే ఆయా శాఖ అధికారులకు, ఉద్యోగులకు నేరుగా అర్జీలు ఇచ్చి సమస్యలను విన్నవించుకోవచ్చని చెప్పారు.

ఓటర్లను ప్రభావితం చేసే ప్రకటనలు ఉండరాదు

పాణ్యం: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి గ్రామంలో, ఇతర జన సమూహం ఉన్న ప్రదేశాల్లో ఓటర్లను ప్రభావితం చేసే ప్రకటనలు, రాజకీయ నాయకుల ఫొటోలు ఉండరాదని తహసీల్దార్ ఫణికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి కూడలిలో రాజకీయ నాయకుల ఫొటోలు, విగ్రహాలు, ఓటర్లను ప్రభావితం చేసే ఇతర బ్యానర్లు, ఫ్లెక్సీలకు ముసుగు వేయించామని తెలిపారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జిలతోనే ప్రమాదాలు

కర్నూలు(సెంట్రల్) : నగరంలోని బాలాజీనగర్, సంతోష్ నగర్‌లలో అశాస్త్రీయంగా నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జిలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర సభ్యుడు ఈ.పుల్లారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఫ్లై ఓవర్లకు అనుసంధానంగా సర్వీసు రోడ్లు, ఫుట్ ఓవర్ వంతెనలను నిర్మించాలన్నారు. అప్పుడే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదన్నారు.

సీఏఏ అమలుకు వ్యతిరేకం

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పౌరసవరణ చట్టం సీఏఏ అమలునకు ఎస్‌డీపీఐ వ్యతిరేకమని ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీర్జా అబ్దుల్లా బేగ్ ప్రకటించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ..సీఏఏ అమలుపై టీడీపీ తన వైఖరి చెప్పాలన్నారు. బీజేపీతో పొత్తుక ట్టిన చంద్రబాబుకు ముస్లింలు ఓటర్లు అవసరం లేదా అని ప్రశ్నించారు.

50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలోకి చేరుతున్న బురాన్‌దొడ్డి వాసులు

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఆదివారం కర్నూలులో కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో 50 ఎస్సీ, బీసీ కుటుంబాల సభ్యులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. గ్రామానికి చెందిన ఓబులేసు, ఏసేపు, శేఖర్, కమ్మరి సుంకన్న, బోయ గోవిందు, గోపాల, ఉప్పరి శేఖర్, వాసు, భాస్కర్, దుబ్బ సోమన్న, గొల్ల క్రిష్ణ, బారికి గోవిందు, తెలుగు లక్ష్మన్న, బక్తరాజు తదితరులకు కోట్ల హర్ష కండువాలు కలిప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ.. సీఎం జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలు, గ్రామ అభివృద్ధి కోసమే తాము, పార్టీలో చేరినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ గెలుపుకోసం కృషి చేస్తామన్నారు. వీరివెంట వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

కవిత్వం రాయడం కళ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: కవిత్వం రాయడం ఓ కళ అని, ఇది మనిషిని చైతన్య వంతునిగా తీర్చిదిద్ది సమాజాన్ని ప్రగతి పథం వైపు నడిపిస్తుందని హైదరాబాద్ సిటీ కాలేజ్ తెలుగు శాఖాధిపతి ప్రముఖ రచయిత డాక్టర్ కోయికోటేశ్వరరావు అన్నారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నాగలి కూడా ఆయుధమే పుస్తక పరిచయ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమ్మువరపు విల్సన్ రావు కవిత్వంలో సామాజిక అంశాలు ఉంటాయన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం గ్రహీత తగుళ్ల గోపాల్ మాట్లాడుతూ నాగలి కూడా ఆయుధమే పుస్తకంలో సామాన్యుని బతుకు చిత్రం కనబడుతుందన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్, నాయకులు విజయులు, తనగల కవులు వెంకటేష్, మారుతి, అరుణ, వెంకటేశ్వర్లు, ఏవీ రెడ్డి, విశ్వనాథ రెడ్డి, డాక్టర్ హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఫార్మాసేల్స్ మేనేజర్ అసోసియేషన్ ఎన్నిక

కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ ఫార్మాసేల్స్ మేనేజర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం స్థానిక గాంధీనగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో జాతీయ ఉపాధ్యక్షుడు జి.రామయ్య ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. జాతీయ ఫార్మాకంపెనీల విషయం, కార్మికుల హక్కుల గురించి సమావేశంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా 2024 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా బండారు దస్తగిరి యాదవ్, వైస్ ప్రెసిడెంట్‌గా రవికిరణ్‌కుమార్, సెక్రటరీగా కె.రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా వై. రామాంజులు రెడ్డి, ట్రెజరర్‌గా శ్రీరామ్‌పుల్లయ్య, జాయింట్ సెక్రటరీగా నాగరాజశేఖర్ ఎన్నికయ్యారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించాలి

- రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ



రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్‌లో స్ట్రాంగ్ రూమ్‌ల గురించి ఆరా తీస్తున్న రిటర్నింగ్ అధికారి

కర్నూలు (టౌన్) : కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన మార్గదర్శకాలను అన్ని రాజకీయ పార్టీలు తప్పని సరిగా పాటించాలని 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ అన్నారు.ఆదివారం స్థానిక నగరపాలక సంస్థ కౌన్సి ల్ హాలులో వివిధ రాజకీయ పార్టీల అధికారిక ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉందన్నారు. కాన్వాసింగ్, ప్రచార వాహనాలు, లౌడ్ స్పీకర్, తాత్కాలిక పార్టీ కార్యాలయాన్ని నిర్వహించడం, స్ట్రీట్ కార్నర్ మీటింగ్, ఊరేగింపు, ర్యాలీ, పోస్టర్, హోర్డింగ్, బ్యానర్ జెండాలను ప్రదర్శించడం తదితర వాటికి అనుమతి తప్పనిసరి అన్నా రు. అనుమతి లేని పోస్టర్లు, బ్యానర్లు వంటి ప్రచా ర సాధనాలను తొలగిస్తామని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఖచ్చితంగా అనుమతులు పొందిన ప్రచార సాధనాలనే ఉపయోగించాలన్నారు. ఇప్పటికే నగరంలోని రాజకీయ నాయకుల విగ్రహాలను కప్పి వేశామని, అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు తొలగించామన్నారు. సమావేశంలో నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ మోహన్‌కుమార్, టౌన్ ప్లానింగ్ డీసీపీ సంధ్య, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నోడల్ అధికారి రంగస్వామి పాల్గొన్నారు. అంతకు ముందు రిటర్నింగ్ అధికారి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, స్టాటిక్ సర్వైలెన్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌ల విధి విధానాలపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కమిషనర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల వద్ద పనులు త్వరితగతిన పూర్తి చేయండి

ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూముల వద్ద పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తే జ స్పష్టం చేశారు. ఆదివారం రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లను నగరపాలక, టిడ్కో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు.

మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం





వీకర్ సెక్షన్ కాలనీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువనేత కాటసాని శివనరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు అర్బన్ 37వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలో కార్పొరేటర్ ఆయిషా సిద్ధిఖీ, స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ పాలనలో ఏదైనా సంక్షేమ పథకం లబ్ధి చేకూరాలంటే జన్మభూమి కమిటీల సిఫారసుతో పాటు నాయకులు అండదండలు అవసరమయ్యేవని గుర్తు చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, రాజకీయాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. పథకాల లబ్ధిలో ఎలాంటి అవినీతికి అస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుని మరింత సంక్షేమాభివృద్ధి సాధిద్దామన్నారు. అధికారం కోసం ప్రతిపక్షాలు చేస్తున్న అసత్యాలు, మోసపూరిత మాటలను నమ్మి మోసపోవదని ప్రజలకు సూచించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ నాయకడు చంద్రబాబు 600 పైగా హామిలిచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేసిన సంగతిని గుర్తు చేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

కల్లూరు: కల్లూరు అర్బన్ 31వ వార్డుకు చెందిన సుమారు 100 కుటుంబాలు ఆదివారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. స్థానిక కార్పొరేటర్ మిద్దె చిట్టెమ్మ ఆధ్వర్యంలో 31వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ కృష్ణతో పాటు కేశవ్, లాజర్, మద్దిలేటి, విజయ్, నరసింహుడు తదితరులకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువనేత కాటసాని శివనరసింహారెడ్డి పార్టీ కండువా వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు టీడీపీ అందించిన పాలనకు, 2019 నుంచి ఇప్పటి వరకు వైఎస్ జగన్ అందించిన పాలనలో తేడాను గమనించాలన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు పొదుపు రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పొదుపు రుణాలను మాఫీ చేశారన్నారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు వైఎస్సార్ చేయూత కింద ఏడాదికి రూ. 18,750 ఆర్థిక సహాయం అందజేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్ఆర్ సీపీని గెలిపించాలని కోరారు. కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మీరెడ్డి, నాయకులు తిరుపాలు, పెద్దన్న, శివారెడ్డి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలోని దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటనలో కోరారు. స్థానిక మండల భవిత కేంద్రం ప్రతి సోమవారం దివ్యాంగులకు శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్‌చే ఫిజియోథెరపీ నిర్వహించడం జరుగుతుందన్నారు. కుటుంబ సభ్యులు దివ్యాంగులకు భవిత కేంద్రానికి తీసుకవచ్చి, ఫిజియోథెరపీ చేయించాలని ఈ మేరకు ఎంఈఓ విజ్ఞప్తి చేశారు.

పది పరీక్షలకు ఆరు పరీక్షా కేంద్రాలు

కోడుమూరు రూరల్: మండలంలో పదో తరగతి పరీక్షలకు ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ వసంతలక్ష్మి ఆదివారం తెలిపారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి మొత్తం 1430మంది విద్యార్థినీ, విద్యార్థులు పది పరీక్షలు రాయనుండగా, కోడుమూరులోని బాలురు, బాలికల హైస్కూల్ ఏ,బీ, మోడల్ స్కూల్‌తో పాటు, లద్దగిరి హైస్కూల్, గోరంట్ల రెసిడెన్షియల్ పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ముగిసిన ఉరుసు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన సద్గురు మహాత్మ బడేసాహెబ్ తాత ఉరుసు ఘనంగా ముగిసింది. శుక్రవారం గంధం, శనివారం ఉరుసు మహోత్సవం, ఆదివారం జియారత్ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఫాతెహాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి దర్గా పీఠాధిపతులు మన్సూర్, ఉసేన్, బడేసా, చాంద్‌బాషా తదితరులు స్వామి వారి గంధంతో మేళతాళలతో ఊరేగింపుగా దర్గాకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వామి వారి జీవసమాధికి గంధం పట్టించారు. సమాధిని పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

నేటి నుంచి పది పరీక్షలు



పాణ్యం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హాల్ టికెట్ నంబర్లను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం

పాణ్యం: ఈ నెల 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. నియోజకవర్గంలోని పాణ్యంలో 4 పరీక్ష కేంద్రాల్లో 1,021 మంది, గడివేములలో 2 కేంద్రాల్లో 410 మంది, ఓర్వకల్లులోని 5 కేంద్రాల్లో 1,156 మంది, కల్లూరులోని 18 కేంద్రాల్లో 4,390 మంది మొత్తం 29 కేంద్రాల్లో 6,977 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

బురాన్‌దొడ్డి కుంటకు చేరిన ఎల్‌ఎల్‌సీ నీరు



బురాన్‌దొడ్డి కుళాయిల కుంటకు చేరిన మంచినీటిని పరిశీలిస్తున్న గ్రామ పెద్దలు

సి.బెళగల్: ఎల్‌ఎల్‌సీ నీరు ఆదివారం బురాన్‌దొడ్డి కుంటకు చేరింది. మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామ ప్రజల మంచినీటి సమస్యను నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు పరిష్కరించారు. గ్రామంలో ఐదు రోజులపాటు సాగే ఉరుసు ఉత్సవాలు ఉండటంతో గ్రామస్తులకు మంచినీటి సమస్యను గ్రామ పెద్దలు రాజశేఖర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, చంద్ర, గోపాల తదితరులు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన నేతలు ఇరిగేషన్ అధికారులతో చర్చించి గ్రామానికి ఎల్ఎల్‌సీ ద్వారా రోజు 12 క్యూసెక్కుల మేర ఐదు రోజుల పాటు మంచినీటి అందించేలా చర్యలు తీసుకున్నారు. దీనితో 15వ తేదీ విడుదల అయిన నీరు ఆదివారం గ్రామంలోని కుళాయి చెక్కు డ్యాము కుంటలకు చేరుకుంది. గ్రామ పెద్దలు దుబ్బద సుంకన్న, రామాంజనేయులు, తిరుపతయ్య, నరసింహుడు, నాయుడు నీటిని పరిశీలించారు. కుడా చైర్మన్, డాక్టర్ సతీష్‌కు రుణపడి ఉంటామని, ఎల్ఎల్‌సీ డీఈ లక్ష్మణ్‌కుమార్, ఏఈ ఉదయ్ భాస్కర్, వర్క్ఇన్‌స్పెక్టర్ అర్జుడు తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

సీట్ల కేటాయింపులో సామాజిక న్యాయం

కర్నూలు(అర్బన్): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన సీట్ల కేటాయింపులో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికి నచ్చే విధంగా సామాజిక న్యాయం పాటించారని ఏపీ ముస్లిం కౌన్సిల్ అధ్యక్షుడు సయ్యద్ రోషన్ ఆలీ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సమన్యాయం చేశారన్నారు. ఈ జాబితాను ఏపీ ముస్లిం కౌన్సిల్ మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తోందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన విధంగా ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్ జగన్ ఏడుగురు ముస్లింలను ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రకటించారన్నారు. భవిష్యత్తులో కూడా సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే ఇలాంటి డేర్ అండ్ డైనమిక్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాల్సిన చారిత్రక ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గతంలో ఏ రాజకీయ పార్టీ కూడా ఇంత ధైర్యంగా అణగారిన వర్గాలను రాజకీయ పదవుల్లో భాగస్వామ్యం చేయలేదన్నారు.